క్లుప్తంగా

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ రాజశేఖర్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు నరసింహారావు, మాలతి గాబ్రియేల్ పాల్గొన్నారు.

ఎర్రదండును జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి: సూళ్లూరుపేటలో ఆదివారం ఎర్రదండు ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి శివకుమార్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎర్రదండు, మహాసభలకు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథ్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జెల్లీ విల్సన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొనే మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

పాఠశాల మా కాలనీలోనే ఉండాలి


ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

శ్రీకాళహస్తి: తాము చదువుకునే పాఠశాల తమ కాలనీలోనే ఉండాలని శ్రీకాళహస్తి మండలం యార్లపూడి పంచాయతీ రాజుగుంట ఎస్సీకాలనీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. బుధవారం వారు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ ఇక్కడి పాఠశాలలోని 3, 4, 5వ తరగతుల విద్యార్థులను మన్నవరం పాఠశాలలో విలీనం చేయొద్దన్నారు. దీనివల్ల తమ పిల్లలు ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీలోని పాఠశాలను తరలించవద్దని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలన్నారు.

డీఎల్ లేకుంటే వాహనం సీజ్


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సునీల్

నాగలాపురం: లైసెన్సు లేకుండా వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేస్తామని ఎస్‌ఐ సునీల్ స్పష్టం చేశారు. ఈమేరకు స్థానిక బైపాస్ రోడ్డు వద్ద ఎస్‌ఐ సునీల్ సిబ్బందితో కలిసి విస్తృతంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని, అలాగే సరైన పత్రాలు లేని వాహనాలను, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించకుండా నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్సు, ఇన్సూరెన్సు లేని వాహనాలకు చలానా విధించారు. ఎస్‌ఐతోపాటు కానిస్టేబుల్ భూపతి, దివాకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న డీఈఓ

తొట్టంబేడు: దిగువ సాంబయ్య పాళెం ఫౌండేషన్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం రాసిన సీతాకోక చిలుక గేయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ఒకటవ తరగతి తెలుగు వాచకంలో పాఠ్యాంశంగా తీసుకోవడం విదితమే. జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.యన్.కుమార్ ఆ పుస్తకాన్ని పరిశీలించి బాలసుబ్రహ్మణ్యంను మరిన్ని రచనలు చేయాలని ఆకాంక్షిస్తూ అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న పీడీ

రేణిగుంట: రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం పీడీ వసంతబాయ్ తనిఖీ చేశారు. తండ్లం, విప్పమాను పట్టెడ, ఎస్‌ఆర్ పట్టెడలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలతో మాట్లాడారు. పరిశుభ్రత, మెనూ, పౌష్టికాహారంపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీడీపీఓ కృష్ణవేణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు భారతి, కోకిల, శంకరమ్మ పాల్గొన్నారు.

గంగమ్మా.. పాహిమాం


విద్యుద్దీపాలంకరణలో ఏర్పాటు చేసిన ఆర్చ్, గంగమ్మ

రేణిగుంట గంగ జాతర బుధవారం కోలాహలంగా ముగిసింది. మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. వివిధ వేషధారణలో వచ్చి భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. -రేణిగుంట




గంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు




అమ్మవారికి చీర సమర్పిస్తున్న భక్తురాలు, అమ్మవారికి పొంగళ్లు పెట్టేందుకు వెళుతున్న భక్తురాలు

పేదలపై కక్ష ఎందుకు?

- కూల్చివేసిన ఇళ్లను పరిశీలించిన సీపీఐ నేతలు


కూల్చి వేసిన ఇళ్లను పరిశీలిస్తున్న నేతలు

రేణిగుంట: మండలంలోని జీపాళ్యం పంచాయతీ పద్మానగర్‌లో కూల్చివేసిన పేదల ఇళ్లను సీపీఐ నేతలు బుధవారం పరిశీలించారు. అనంతరం బాధితులతో మాట్లాడి వాస్తవాలను తెలుసుకున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి నాయకులు పేదలపై కక్ష కట్టిన విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మండలంలో కోట్ల విలువ చేసే భూములను అధికార పార్టీ నేతలు ఆక్రమించుకుంటున్నా రెవెన్యూ అధికారులకు కనపడకపోవడం శోచనీయమన్నారు. భూ కబ్జాలు జరుగుతున్నా వాటి జోలికి వెళ్లకుండా, పేదల ఇళ్లను కూల్చివేయడం దారుణమన్నారు. కలెక్టర్, ఆర్డీఓ స్పందించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, మండల పార్టీ కార్యదర్శి వైఎస్ మణి, మహేంద్ర, కార్తీక్, సెల్వ, భాను, అమ్ములు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో సెర్ఫ్ ఉద్యోగుల నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సెర్ఫ్ ఉద్యోగులు

నారాయణవనం: అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం మహిళా ఏపీఎం రజనికుమారిపై దాడిని ఖండిస్తూ మండలం వెలుగు (సెర్ఫ్) ఉద్యోగులు కార్యాలయ ఆవరణలో బుధవారం సాయంత్రం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సెర్ఫ్ ఉద్యోగుల రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు, మండల ఏపీఎం ధనంజయరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులపై దాడి వంటి దుశ్చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరానిదన్నారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పనిచేస్తున్న ప్రాంతాల్లో, కార్యాలయాల్లో ఉద్యోగులపై దాడులు జరగకుండా ప్రభుత్వం తక్షణం భద్రతా చర్యలను చేపట్టాలని ఆయన అన్నారు. అన్నయమ్మ జిల్లా కలెక్టర్, ఎస్పీలు స్పందించి బాధితురాలు రజనీకుమారికి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సెర్ఫ్ ఉద్యోగుల జిల్లా గౌరవ అధ్యక్షులు నాగేంద్ర రావు, మండలం ఏపీఓ సుకన్య, సీసీలు సుదర్శన్ రాజు, అరుణ్ కుమార్, రాజేశ్వరి, నిమ్మి, వీఓఏలు బుజమ్మ, సెల్వి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిగ్రీ కళాశాల అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం భోజన విరామ సమయంలో ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ వెంటనే అధ్యాపకుల బదిలీలు చేపట్టాలన్నారు. ఎయిడెడ్ అధ్యాపకులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ జీఓ నంబర్ 42ను వెంటను రద్దు చేయాలన్నారు. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీంను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రిన్సిపల్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఏఈ చలపతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయం సమీపంలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ప్రారంభించారు. 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో గ్రామంలో లోఓల్టేజీ సమస్య తీరిందని ఏఈ తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో ట్రాన్స్‌కో ఏఈ చలపతి, గ్రామస్తులు సుధాకర్‌నాయుడు, మునెయ్యానాయుడు గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుమలకు నివాళి

శ్రీకాళహస్తి: దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి సీపీఐ సభ్యుడు తిరుమల (35) సోమవారం రాత్రి వేలవేడు గ్రామంలో మృతిచెందాడు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథ్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి, జిల్లా కార్యదర్శి పి మురళి జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, జనమాల గురవయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి చిన్నం కాలయ్య తిరుమల మృతదేహానికి పూలమాలలు వేసి ఎర్ర జెండాను కప్పి నివాళులర్పించారు.

ముగిసిన పోలేరమ్మ జాతర


ఊరేగుతున్న శ్రీ పోలేరమ్మ దేవత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు గ్రామంలో గ్రామదేవత శ్రీ పోలేరమ్మ దేవత జాతర బుధవారం ముగిసింది. జాతరలో భాగంగా పోలేరమ్మ దేవత విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూజలు చేశారు. దేవాలయంలోని దేవుళ్ల విగ్రహాలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోలేరమ్మ ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు భారీ సంఖ్యలో ఎదురు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర నిర్వహించడంతో గ్రామంలో బంధువులు, భక్తులతో జాతర శోభ సంతరించుకుంది. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

క్వారీలతో దళితుల జీవితం దుర్భరం


చమర్తి కండ్రిగలోని క్వారీల వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

సత్యవేడు: మండలంలోని పీవీ పురం పంచాయతీ చమర్తిగండ్రిగ గిరిజన కాలనీ సమీపంలో క్వారీలకు అనుమతులు ఇవ్వడంతో గిరిజనులు, దళితుల జీవనం దుర్భరంగా మారిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, కార్యవర్గ సభ్యులు ఏ.చిన్నిరాజ్, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జనార్దన్, మండల కార్యదర్శి రమేష్ స్థానిక గిరిజనులు, దళితులతో కలసి బుధవారం క్వారీల సమీపంలో ధర్నా చేశారు. చిన్నిరాజ్ మాట్లాడుతూ క్వారీలకు సమీపంలో గిరిజన కాలనీ ఉండడంతో క్వారీల మందుగుండు పేలుళ్లకు కాలనీలో నివాస గృహాలు బీటలు వారి పోతున్నాయన్నారు. క్వారీ నుంచి వచ్చే దుమ్ము ధూళితో స్వచ్ఛమైన తాగు నీరు లభించడం లేదన్నారు. గిరిజన కాలనీలో బావినీరు వట్టిపోయిందన్నారు. సీపీఐ నాయకడు జనార్దన్ మాట్లాడుతూ క్వారీ గుంతల కారణంగా అడవిలోకి వెళ్లేందుకు దారి లేక జీవనాధారం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేత మురళి, సుధాకర్‌రెడ్డి, సుధాకర్, ధనంజయలు మునస్వామి, కుప్పయ్య, గిరిజనులు శ్రీనివాసులు, చిరంజీవి, ఏసురత్నం, లత, రాజేశ్వరి, సుధన, నాగరత్నమ్మ, చెంచురామయ్య, నరేష్ జైచంద్ర పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగ జాతర


నారాయణవనంలో గంగమ్మ


సముదాయంలో గంగమ్మ

నారాయణవనం: ఏడు గంగమ్మల జాతరను బుధవారం భక్తి శ్రద్ధలతో మండల వాసులు జరుపుకున్నారు. నారాయణవనం, సముదాయం, కీళగరం, వీకే పాళ్యం, నాగిలేరు, బొప్పరాజుపాళ్యంలో ఏడు గంగమ్మలు విశేష అలంకరణలతో వేర్వేరుగా మంగళవారం రాత్రి ఊరేగింపునకు బయలుదేరాయి. బుధవారం వేకువజామున నిర్దేశిత ప్రదేశాలలో కొలువుదీరి భక్తుల నుంచి పూజలు అందుకున్నాయి. నారాయణవనంలోని రజక కాలనీ నుంచి విశేష అలంకరణలతో గంగమ్మ మంగళవారం రాత్రి బయలుదేరింది. గ్రామీణ సంప్రదాయ వాయిద్యాలు, బాణసంచా మోతలతో ఊరేగింపు వీధుల్లో కొనసాగింది. బుధవారం ఉదయం అమ్మవార్లు బజారు వీధి, రేణుకమ్మ గుడి, కీళగరం కూడలి సమీపంలో కొలువుదీరాయి. మహిళలు, పిండి దీపాలతో నడి వీధుల్లో కొలువుదీరిన అమ్మవార్లకు కుడుములు, పిండి వంటకాలతో కుంభం సమర్పించారు. బుధవారం అర్ధరాత్రి నిమజ్జనంలో అమ్మవార్ల పసుపును అందరికీ పంచిపెట్టారు.

అపోవా కొత్త కమిటీ ఎన్నిక


నూతన కమిటీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో బుధవారం అపోవా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అపోవా నూతన అధ్యక్షుడు కోటిలింగాల శశిధర్ మాట్లాడుతూ కేఆర్ కృష్ణయ్యశెట్టి 1995లో అపోవ ట్రస్టును స్థాపించారన్నారు. ఈ ట్రస్టు ముఖ్యఉద్దేశం వైశ్య విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే అన్నారు. ప్రత్యేక విద్యాఫౌండేషన్ ఏర్పాటు చేసి నిరుద్యోగయువత భవిష్యత్తు అవసరాలకు రూ.50లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేశామన్నారు. ఈ నిధులతో నిరుద్యోగ యువతకు ఆర్థికసాయం చేస్తామన్నారు. కమిటీలో అధ్యక్షుడిగా కోటిలింగాల శశిధర్, ఉపాధ్యక్షుడిగా అయితా మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మురారి జె.స్వరూప్, సంయుక్త కార్యదర్శిగా గునుపూటి సుమత్‌కుమార్‌లను ఎనుకున్నారు.

అర్ధరాత్రి దుకాణాల్లో చోరీలు


పగులగొట్టిన రేకులు


పగులగొట్టిన తలుపులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని కిరాణాషాపు, కూల్ డ్రింక్‌షాపు, స్వీట్ స్టాళ్లలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగుడు చోరీకి పాల్పడ్డారు. కిరాణషాపులో ఇంటిపై రేకులు ధ్వంసం చేసి, కూల్ డ్రింక్ షాపు, స్వీట్ స్టాల్‌లో తలుపులు పగులగొట్టి రూ.50 వేల నగదును చోరీ చేశాడు. చోరీ చేస్తున్న దుండగుడి దృశ్యాలు స్వీట్ స్టాల్‌లోని సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. దుకాణ యాజమానులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలోని దుండగుడిని గుర్తించి అరెస్టు చేసి, చోరీకి గురైన నగదును రికవరీ చేస్తామని ఎస్‌ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

గంగమ్మకు అంబళ్లు.. సదవాలమ్మకు పొంగళ్లు


సత్యవేడులో నడివీధి గంగమ్మకు అంబళి పోస్తున్న భక్తులు

సత్యవేడు: ఆడిమాసంలో సత్యవేడు ప్రజలు మూడు బుధవారాలు గంగమ్మకు అంబళ్లుపోసి, చదవాలమ్మకు పొంగళ్లు పెడుతున్నారు. సంప్రదాయం ప్రకారం బుధవారం నడివీధి గంగమ్మకు పూజలు చేశారు. ఇంటి వద్ద నుంచి తీసుకువచ్చిన పసుపు కుంకుమ, వేపాకు, అంబలి గంగమ్మ వద్ద ఉంచి పూజలు చేసి, కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం పర్ణశాల ముందు ఉంచిన పెద్ద పాత్రల్లో అంబలి పోశారు. భక్తులకు పంచిపెట్టారు. మధ్యాహ్నం చెల్లాతమ్మ గుడి వద్ద పొంగళ్లు పెట్టి కొబ్బరికాయలు కొట్టి సదవాలమ్మకు మొక్కులు చెల్లించారు. బుధవారం రాత్రి అమ్మవారి కలశాన్ని పట్టణంలోని గాంధీరోడ్డు, నేతాజీరోడ్డు, పల్లావు వీధి, గంగమిట్ట వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో జాతర నిర్వాహకులు సోమయ్యశెట్టి, గోపినాథ్, ప్రసాద్, కోదండరెడ్డి పర్యవేక్షణలో ఊరేగింపు సాగింది.

మళ్లీ మొదలైన మట్టి దోపిడీ


విరయ్యపాలెం చెరువు నుంచి టిప్పర్లలో తరలిస్తున్న మట్టి


టిప్పర్‌కు లోడింగ్ చేస్తున్న హిటాచీ యంత్రం

- విరయ్యపాలెం చెరువు నుంచి తరలింపు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో గ్రావెల్ అక్రమ రవాణా మళ్లీ మొదలైంది. ఇటీవల కొద్ది రోజులుగా అక్రమ రవాణాను తాత్కాలికంగా నిలిపివేశారు. అయితే వరదయ్యపాళెం మండలం విరయ్యపాలెం చెరువు నుంచి బుధవారం పెద్ద ఎత్తున తమిళనాడుకు మట్టి టిప్పర్ లారీలతో తరలిస్తున్నారు. అయితే దీన్ని అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం ఏమీ పట్టనట్లుగా చోద్యం చూస్తుండడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. ఇటీవల అధికార యంత్రాంగం పూర్తిగా గ్రావెల్ అక్రమ రవాణా తమిళనాడుకు జరిగేందుకు వీల్లేదని తెగేసి చెప్పింది. అయితే ప్రస్తుతం అవేమి పట్టని తెలుగు తమ్ముళ్లు మళ్లీ తెర వెనక మంతనాలు జరిపి, చకచకా భారీ ఎత్తున టిప్పర్లతో తమిళనాడుకు తరలించేస్తున్నారు.

కో–ఆర్డినేటర్ ఆదేశాలు బేఖాతర్

నెలరోజుల క్రితం సత్యవేడు నియోజకవర్గం ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్‌గా తిరుపతికి చెందిన వ్యాపారవేత్త శంకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన గ్రావెల్ అక్రమ రవాణాను నిలువరిస్తామని, ఎక్కడా అనధికారికంగా గ్రావెల్ అక్రమ రవాణా జరిగేందుకు వీలు లేదని హెచ్చరించారు. ఆ దశగా జిల్లా అధికార యంత్రాంగానికి ఫిర్యాదు చేసి నియంత్రించే చర్యలు చేపట్టారు. నెలరోజుల పాటు సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల్లో అక్రమ రవాణాను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. అయితే ప్రస్తుతం శంకర్‌రెడ్డి ఆదేశాలు బేఖాతర్ చేస్తూ గ్రావెల్ అక్రమ రవాణా మొదలైంది.

అన్నిచోట్ల అక్రమ రవాణాకు సన్నద్ధం

వరదయ్యపాళెం మండలం విరయ్యపాళెం చెరువు నుంచి బుధవారం గ్రావెల్ అక్రమ రవాణా చేసేందుకు అదే మండలానికి చెందిన టీడీపీ నాయకులు అక్రమ రవాణాకు సిద్ధమయ్యారు. దీన్ని అదునుగా భావించిన అక్రమార్కులు సత్యవేడు, నాగలాపురం మండలాల్లో కూడా గ్రావెల్ దోపిడీకి సిద్ధమవుతున్నారు. ఆ దశగా తెర వెనుక రాజకీయ పెద్దలు, అధికారులతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం.